

### పసి హృదయాల 'సంజీవని'

సత్యసాయి చైల్డ్ కేర్ సెంటర్‌లో ఉచిత ఆపరేషన్

రెండు నెలల్లో 60కిపైగా చిన్నారులకు వైద్యం

నేటి నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభం

7 లో

## ఉప రాష్ట్రపతి పర్యటన..


# ఐఐటీ హెచ్‌లో సందడి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్

- ఐఐటీహెచ్‌లో జరుగుతున్న పరిశోధనలపై ఆరా
- విద్యావిధానం, అభివృద్ధిపై వాకబు
- విద్యార్థులకు సలహాలు, సూచనలు
- హాజరైన జిష్ణుదేవ్‌వర్మ, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఐఐటీహెచ్ బోర్డ్‌ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి
- ఉపరాష్ట్రపతి రాకతో భద్రతావలయంలో ప్రాంగణం
- 'ఏక్ పేడ్ మా కే నామ్'లో భాగంగా మొక్కను నాటిన జగ్‌దీప్ ధన్‌కర్ దంపతులు

7 లో



ఉపరాష్ట్రపతికి జ్ఞాపికను అందజేస్తున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

## కరెంట్ సమస్య ఉంటే 1912కు ఫోన్ చేయండి

- సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం
- మెదక్ సర్కిల్‌లో రూ.50 కోట్లతో పనులు
- నాణ్యమైన విద్యుత్.. నిరంతర సరఫరాయే లక్ష్యం
- ట్రాన్స్‌కో మెదక్ ఎస్ఈ శంకర్



మెదక్ ఎస్ఈ శంకర్

**షటా షట్**

మెదక్ అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని టీజీఎస్పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) శంకర్ పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో ప్రస్తుతం 8.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉందని ఆయన తెలిపారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో డిమాండ్ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని 11.5 మిలియన్ యూనిట్ల డిమాండ్‌ను తట్టుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. డిమాండ్ పెరిగినా నిరంతరాయంగా సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నాని వెల్లడించారు. వేసవి అవసరాలకు అనుగుణంగా సమ్మర్ యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేశామని తెలిపారు. సరఫరా మెరుగుపరిచి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నట్లు 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో తెలిపారు.

**వేసవిలో విద్యుత్ వినియోగం పెరగడంతో ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారంతో అంతరాయాలు ఏర్పడకుండా మీ కార్యాచరణ ఏమిటి?**

రాబోయే మూడు నెలలు విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతుందని అంచనా వేస్తున్నాం. గతేడాది వేసవి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. ఇందుకోసం రూ. 50 కోట్లతో వివిధ పనులను చేస్తున్నాం. జిల్లాలో ఇప్పటికే 800 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. ఇంకా 85 ట్రాన్స్‌ఫార్మర్లను వారంలో ఏర్పాటు చేస్తాం. జిల్లావ్యాప్తంగా 13 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నాం. పాతూర్, ఝాన్సిలింగాపూర్, ముప్పిరెడ్డిపల్లి, శభాష్‌పల్లి, జప్తిశివనూర్, మెదక్, నర్సాపూర్ సబ్‌స్టేషన్లలో 5 మెగావాట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఆరు, 12.5 మెగావాట్ల సామర్థ్యం ఉన్నవి ఆరు ఏర్పాటు చేస్తున్నాం. దీంతో, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గుతాయి.

**అంతరాయాల నివారణకు తక్షణ చర్యలేమిటి?**

జిల్లాలో పెరుగుతున్న వినియోగానికి తగ్గట్టు విద్యుత్ సరఫరాకు అవసరమైన చర్యలకు ఎస్పీడీసీఎల్ ప్రాధాన్యమిస్తోంది. బ్రేక్‌డౌన్ సమస్యలను తక్షణం స్పందించేందుకు సిబ్బందితో కూడిన ప్రత్యేక వాహనం అందుబాటులో ఉంది. మరో మూడు జిల్లాకు రానున్నాయి. ఇప్పటికే 132కేవీ, 33కేవీ సబ్‌స్టేషన్లలో మెయింటనెన్స్ పనులు పూర్తిచేశాం.

**వినియోగదారులు సమస్యలపై ఎలా సంప్రదించాలి?**

ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ లోవోల్టేజీ, బ్రేక్‌డౌన్స్ ప్రమాదకర స్తంభాలు, తీగలు, బిల్లులు, మీటర్లలో సమస్యలు, పేరుమార్పు, హెచ్చుతగ్గులు, సర్వీస్ రద్దు, ఇలా అన్నిరకాల అంశాలపై సంప్రదించేందుకు విద్యుత్ సంస్థ 1912 టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసింది. ఫోన్ రాగానే ఫిర్యాదును సత్వరం పరిష్కరిస్తున్నాం. 24/7 సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉంటారు.

**గాలులకు విద్యుత్ తీగలు తెగి సరఫరా పునరుద్ధరణలో సమయం పడుతుంది. దీనికి ప్రత్యామ్నాయ చర్యలు ఏం తీసుకుంటున్నారు?**

ప్రకృతి వైపరీత్యాలు, ఇతర ఘటనలు జరిగినప్పుడు తలెత్తే అంతరాయాలను నివారించేందుకు సబ్‌స్టేషన్ల మధ్య అంతర్గత అనుసంధానానికి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడుతున్నాం. ఒక సబ్‌స్టేషన్ పరిధిలో సమస్య ఉత్పన్నమైతే వేరే సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాటు చేస్తున్నాం. జిల్లావ్యాప్తంగా ఆరు మండలాల్లోని గ్రామాలు, పట్టణాల్లో 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే స్థలాల సేకరణ, టెండర్ ప్రక్రియ పూర్తిచేశారు. ఒక్కో సబ్ స్టేషన్‌కు రూ.5.50 కోట్లు కేటాయించారు. దాదాపు 24 కోట్లతో కొత్తగా మెదక్, చల్మెడ, బాలనగర్, వెంకటాయిపల్లి, చండూర్, మహ్మద్‌నగర్, మిర్జాపల్లిలో సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టనున్నాం. రెండు నెలల్లో నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందించాం.

## కొత్త రేషన్‌కార్డులకు గ్రీన్‌సిగ్నల్



- మెదక్ జిల్లాలో 81వేల దరఖాస్తులు
- రాష్ట్ర కమిషనరేట్‌కు నివేదిక
- గ్రామసభల్లో లబ్ధిదారుల జాబితా ఎంపిక
- వివరాల నమోదుకు మొబైల్ యాప్

మెదక్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు రేషన్‌కార్డులను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే కులగణన ద్వారా చేపట్టిన సర్వే ఆధారంగా మెదక్ జిల్లావ్యాప్తంగా 21 మండలాల పరిధిలో ఒక్కో గ్రామాన్ని ఎంపికచేసి 11,515 రేషన్ కార్డులను జనవరి 26న పంపిణీ చేశారు. దీంతో పాటు జిల్లా అంతటా నిరుపేదలకు ప్రజాపంపిణీ కార్డులు అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రజాపాలన, గ్రామసభలు, ప్రజావాణిల్లో 81వేల దరఖాస్తులు వచ్చాయి. ఈ అప్లికేషన్లు కలెక్టర్ ఆమోదం పొందిన అనంతరం జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు రాష్ట్ర సివిల్‌సప్లై కమిషనరేట్‌కు పంపించారు. అర్హులందరికీ సకాలంలో రేషన్‌కార్డులు అందేలా పౌర సరఫరాలశాఖ కమిషనర్ మార్గదర్శకాలను రూపొందించారు. వీటి ప్రకారం మండలస్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో కమిషనర్లు లబ్ధిదారుల గుర్తింపు బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి పర్యవేక్షించనున్నారు.

**పంచాయతీల్లో ముసాయిదా జాబితా ప్రదర్శన**

కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి రాష్ట్ర కమిషనరేట్ నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే ముసాయిదా జాబితాలను గ్రామ, వార్డుసభల్లో ప్రదర్శిస్తారు. దీని ప్రకారం స్థానికంగా జాబితాలోని పేర్లు చదివి వినిపించి అభ్యంతరాలు ఉంటే వెంటనే వాటిని పక్కన పెడతారు. ఇలా గ్రామసభల ఆమోదంతో లబ్ధిదారుల జాబితాను మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో మొబైల్ యాప్‌లో నిక్షిప్తం చేయనున్నట్లు తెలుస్తోంది. ఆ జాబితాను మరోసారి పరిశీలించి పౌరసరఫరాలశాఖ కమిషనర్ లబ్ధిదారులకు జారీ చేస్తారు. ఒక కుటుంబానికి ఒకే కార్డు ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం వినియోగంలో 2,14,155 కార్డులకు అదనంగా ఇవి అందుబాటులోకి రానున్నాయి. రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేయడానికి మీ-సేవ కేంద్రాలకు వెళ్లకుండా అధికారులే ప్రజల వద్దకు వచ్చి విచారణ జరిపి అర్హులకు రేషన్‌కార్డులు అందజేయనున్నట్లు పౌరసరఫరాల అధికారులు తెలిపారు.

### వినరో భాగ్యం..

120 డెసిబుల్స్‌కు మించిన శబ్దాలు వింటే లోపాలు తలెత్తే అవకాశం

ఇటీవల పెరుగుతున్న వినికిడి సమస్యలు

గంటల తరబడి ఇయర్‌ఫోన్లు వాడితే అంతే సంగతి

నేడు 'ప్రపంచ వినికిడి దినం'



7

### బాలింత మృతిపై విచారణకు ఆదేశం

రెండు ఆస్పత్రులను తనిఖీ చేసిన వైద్య బృందం

7

ఓ ఆస్పత్రిపై చర్యలకు ఆదేశం

## ఆధ్యాత్మిక కేంద్రంగా బుదేరా

- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- వైదిక పాఠశాల భవనానికి భూమిపూజ



వైదిక పాఠశాల భవనం మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి దామోదర్

మునిపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బుదేరా చౌరస్తా ఆధ్యాత్మిక కేంద్రంగా మరుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. మునిపల్లి మండలం బుదేరా చౌరాస్తా వద్ద దత్తగిరి మహారాజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో నూతనంగా నిర్మించనున్న వైదిక పాఠశాల భవనానికి ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బుదేరా వ్యాపార కేంద్రంగా ఉన్నదని, భవిష్యత్తులో ఈప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. దత్తగిరి మహారాజ్ చారిటబుల్ ట్రస్ట్ బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతి, వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్ బుదేరాలో వైదిక పాఠశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అంతకుముందు బర్దీపూర్ ఆశ్రమానికి సిబంధించిన జ్ఞాపికను మంత్రికి అందజేశారు. అనంతరం ఆయన ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సిద్ధేశ్వర నందగిరి మహారాజ్, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు బుర్కల పాండు, మనోహర్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు రహీం, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

## జేఏసీ పేరిట వసూళ్లు!

**'హైడ్రా' కమిషనర్‌కు పెద్దచెరువు ముంపు బాధితుల ఫిర్యాదు**

అమీన్‌పూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ పెద్దచెరువు ముంపు బాధితుల జాయింట్ యాక్షన్ కమిటీ పేరుతో ప్లాట్ల యజమానుల నుంచి కొందరు వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో గతంలో చేసిన లేఅవుట్లలో సుమారు 20 కాలనీలు, 4వేలకు పైగా ప్లాట్ల యజమానులు ఉన్నారు. వారు సేల్‌డీడ్‌ల ద్వారా 20 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన ప్లాట్లు ప్రస్తుతం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలోకి వస్తున్నాయని ఇంటి నిర్మాణ అనుమతులు జారీ చేయడం లేదు. దీంతో, ఏడాదిగా ప్లాట్ల బాధితులు కొందరు జేఏసీగా ఏర్పడి తమకు న్యాయం చేయాలని ఆందోళనలు చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఇరిగేషన్ అధికారులను కలుస్తూ తమకు న్యాయం చేయాలని అభ్యర్థిస్తూ పిటిషన్లు ఇస్తున్నారు. జేఏసీ నాయకులు గతంలో హైడ్రా కమీషనర్‌ను సైతం కలిసి పరిస్థితిని వివరించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బాధితుల అభ్యర్థన మేరకు నిపుణులతో కమిటీని నియమించి పెద్దచెరువు వాస్తవ విస్తీర్ణం గుర్తించేందుకు హైడ్రా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు జేఏసీ పేరుతో ప్లాట్ల యజమానులకు ఫోన్ చేసి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని బాధితులు శనివారం హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. రూ.వెయ్యి చెల్లించి జేఏసీ వద్ద నమోదు చేసుకుని రసీదు తీసుకోవాలని, సమస్య పరిష్కారం అయిన తరువాత గజానికి రూ.500 చొప్పున ఇవ్వాల్సి ఉంటుందని చెబుతున్నారని ప్లాట్ల యజమానులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ స్పందిస్తూ ఎవరి వద్ద డబ్బులు వసూళ్లకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని తెలిపారని బాధితులు పేర్కొన్నారు. అభ్యంతరాలుంటే హైడ్రా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారని చెప్పారు. పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ అంశంపై ఇరిగేషన్, జేఎన్‌టీయూ, ఐఐటీ సంస్థల నిపుణులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని కమిషనర్ పేర్కొన్నారు.



రంజాన్ ఉపవాస దీక్షలు ఆదివారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. నిజాంపేటలో తొలిరోజు ప్రత్యేక ప్రార్థనలకు ముస్లింలు హాజరై మొదటి ఉపవాస దీక్ష విరమణ చేశారు.

-నిజాంపేట, మార్చి (ఆంధ్రజ్యోతి)

**రంజాన్ వేళలు**

సోమవారం ఇఫ్తార్: సాయంత్రం 6.28

మంగళవారం సహర్: ఉదయం 5.10

## కడుతుండగానే కూలుతోంది..

ఓఆర్ఆర్‌కు అనుసంధానంగా ఏర్పాటు చేస్తున్న రేడియల్ రోడ్డు-30 ఎక్స్‌టెన్షన్ డివైడర్ నిర్మాణ దశలోనే కూలుతోంది. సీసీతో కట్టిన డివైడర్ గోడ నాణ్యతాలోపం కారణంగా ఎక్కడికక్కడ పగుళ్లుబారుతోంది. డివైడర్ మధ్యలో మొక్కల పెంపకం కోసం సారవంతమైన మట్టి తీసుకురావాల్సి ఉన్నా.. ఓ భవన సెల్లార్ తవ్వుతుండగా వస్తున్న బండరాళ్లతో కూడిన మొరంనే వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

-రామచంద్రాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి)





# సంగారెడ్డి ఎంసీహెచ్‌లో శిశువు మృతి!

- కడుపులోనే కన్నుమూసిన పసికందు
- డాక్టర్ల నిర్లక్ష్యం వల్లేనంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ
- ఉమ్మనీరు మింగడం వల్లే శిశువు మృతి : ఆర్‌ఎంవో

సంగారెడ్డి అర్బన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో నవజాత శిశువు మృతిచెందింది. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. ఆస్పత్రి వర్గాలు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం ఎస్‌ఎన్.కాలనీకి చెందిన ప్రియాంక కుమారి(22) మొదటి కాన్పు నిమిత్తం సంగారెడ్డి ఎంసీహెచ్‌లో అడ్మిషన్ పొందారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు సాధారణ ప్రసవం కోసం వేచి చూశారు. ఇంతలో కడుపులో ఉన్న శిశువు హార్ట్‌బీట్ రేటు తగ్గడాన్ని గుర్తించిన డాక్టర్లు హుటాహుటిన ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లి సిజేరియన్ చేశారు. అప్పటికే కడుపులోనే మగ పసికందు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఉమ్మనీరు మింగడం వల్లే శిశువు మృతిచెందిందని డాక్టర్లు కుటుంబసభ్యులకు సూచించారు.

## ఆర్‌సీపురం పీహెచ్‌సీ, పటాన్‌చెరు ఆస్పత్రులే కారణం

ఇలా ఉండగా శనివారం అర్ధరాత్రి కడుపు నొప్పి వస్తుందని ప్రియాంక కుమారి ఆర్‌సీపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లింది. ప్రసవం కోసం ప్రయత్నం చేసినప్పటికీ లోపల శిశువు ఉమ్మనీరు మిగిందంటూ చివరి నిమిషంలో పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఇక్కడా డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో సంగారెడ్డిలోని ఎంసీహెచ్‌కు రెఫర్ చేశారు. ఎంసీహెచ్‌లో డాక్టర్లు సాధారణ ప్రసవం కోసం మరింత సమయం వేచి చూశారే తప్పా వచ్చిన వెంటనే సిజేరియన్ చేసి ఉంటే తమ బిడ్డ బతికేవాడని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తన బిడ్డ మృతికి ఆర్‌సీపురం పీహెచ్‌సీ, పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రులే ప్రధాన కారణమని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ రెండు ఆస్పత్రుల్లో డాక్టర్లు అందుబాటులో ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని తండ్రి దీపక్ వాపోయారు. ఆ రెండు ఆస్పత్రుల్లో డ్యూటీలో ఉండాల్సిన డాక్టర్ల లేరని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంతో నమ్మకంతో సర్కారు దవాఖానాకు వస్తే తమ బిడ్డను దక్కకుండా చేశారని తండ్రి కన్నీటి పర్యంతమయ్యారు.



ఎంసీహెచ్ మృతి చెందిన పసికందుతో తండ్రి, కుటుంబసభ్యులు


## డాక్టర్ల నిర్లక్ష్యం లేదు

రెండు ఆస్పత్రులు తిరిగి చివరి నిమిషంలో గర్భిణిని ఎంసీహెచ్‌కు తీసుకువచ్చారని, అయినప్పటికీ సాధారణ ప్రసవం కోసం ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో కడుపులోని పసికందు హార్ట్‌బీట్ పడిపోతుండటంతో సిజేరియన్ చేశాం. అప్పటికే కడుపులోనే పసికందు ఉమ్మనీరు మింగి చనిపోయింది. పసికందు మృతిపై ఎంసీహెచ్ డాక్టర్ల నిర్లక్ష్యం లేదు.

– డా.వీరాంజనేయులు, సీఎస్ఆర్ఎంవో, జీజీహెచ్, సంగారెడ్డి

క్రైం కార్నర్

## బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
# గోపాలమిత్ర మృతి


వెంకట్‌రెడ్డి(ఫైల్)

చిన్నకోడూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను ఆర్టీసీ బస్సు వెనక నుంచి ఢీ కొట్టడంతో కిందపడి తలకు తీవ్రగాయాలైన గోపాలమిత్ర అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామ శివారులో రాజీవ్‌రహదారిపై ఆదివారం జరిగింది. ఎస్‌ఐ బాలకృష్ణ కథనం ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లికి చెందిన మార్గాడి వెంకట్‌రెడ్డి(52) గోపాలమిత్రగా(పశు వైద్యం సిబ్బంది) విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం ఉదయం వెంకట్‌రెడ్డి తన విధుల్లో భాగంగా ఇంటి నుంచి బైక్‌పై ఇబ్రహీంనగర్ గ్రామానికి పశువులకు వైద్యం చేయడానికి బయలుదేరాడు. ఈ క్రమంలో రామునిపట్ల గ్రామ శివారులోకి రాగానే అదే మార్గంలో సిద్దిపేట నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను వెనక వైపు నుంచి ఢీకొట్టింది. దీనితో బైక్‌పై నుంచి కిందపడి వెంకట్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకట్‌రెడ్డి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### చింత చెట్టుపై నుంచి పడి ఒకరు..

కల్హేర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి), మండల పరిధిలోని బీబీపేట్ గ్రామంలో పిట్ల పీరయ్య (58) చింతచెట్టుపై నుంచి పడి మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన తన దగ్గరి బంధువుల వద్ద చింతపండు తెంపడానికి పీరయ్య కూలీకి వెళ్లాడు. ప్రమాద వశాత్తు చెట్టుపై నుంచి జారి పడిపోయాడు. అక్కడే ఉన్నవారు గమనించి పీరయ్యను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

### పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి..

వర్గల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన ఆదివారం వర్గల్ మండల పరిధిలో చోటుచేసుకున్నది. బేగంపేట ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధి సెంటూర్ గ్రామానికి చెందిన జంపాల సత్తయ్య(55) కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. దీనిపై ఇంట్లో తరచూ గొడవలు జరుగుతండటంతో మనస్తాపానికి గురై శనివారం మధ్యాహ్నం ఇంటివద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన భార్య లక్ష్మి కుటుంబ సభ్యుల సహాయంతో ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కొంపల్లి వెల్‌నెస్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### చేగుంటలో గుర్తుతెలియని వ్యక్తి ..

చేగుంట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చేగుంట మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకున్నది. చేగుంట ఎస్‌ఐ చైతన్య కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఈనెల 28న గుర్తుతెలియని వ్యక్తి పడిపోయి ఉండగా, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు 108 అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతుడి వివరాల కోసం ప్రయత్నిస్తున్నారు.

నేడు ప్రపంచ వినికిడి దినం

వినడమూ ఓ భాగ్యమే.. వినపడకపోవడం లోపమే కాదు ఓ శాపం కూడా. సినిమా చూస్తున్నప్పుడు దృశ్యం కనపడి సౌండ్ వినపడకపోతే ఎంత టార్చర్‌గా ఉంటుందో ఓసారి ఆలోచించండి. శబ్దం చెవిని చేరకపోతే కనపడేదంతా మూగ ప్రపంచమే. అందుకే వినడమూ ఓ భాగ్యమే.. అలాంటి విలువైన వరాన్ని పెద్ద శబ్దాలను వింటూ సున్నితమైన చెవికి చికాకు తెప్పిస్తున్నాం. భరించలేనంత సౌండ్‌ను పదేపదే చెవికి చేర్చి లోపాలను కొనితెచ్చుకుంటున్నాం. అందుకే సాధారణం కంటే ఎక్కువ డెసిబుల్స్ ఉండే శబ్దాలను చెవికి దరి చేయనీయకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



# వినరో భాగ్యం..

120 డెసిబుల్స్‌కు మించిన శబ్దాలు వింటే లోపాలు తలెత్తే అవకాశం

ఇటీవల పెరుగుతున్న వినికిడి సమస్యలు

గంటల తరబడి ఇయర్‌ఫోన్లు వాడితే అంతే సంగతి

మెదక్ కల్చరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో వినికిడి లోపంతో బాధపడే వారి సంఖ్య ఎక్కువ శాతం కనిపిస్తుంది. గతంలో దాదాపు 20 శాతంగా ఉన్న వినికిడి లోప బాధితులు ప్రస్తుతం 30 నుంచి 35 శాతానికి పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇయర్‌ఫోన్‌లను ఎక్కువగా వాడుతున్నారు. పరిమితికి మించి గంటల తరబడి అదేపనిగా వీటిని ఉపయోగించడంతో కొత్త సమస్యలు కొనితెచ్చుకుంటున్నారని వైద్య వర్గాలు చెబుతున్నాయి. గతంలో తక్కువగా ఉన్న వినికిడి సమస్య బాధితులు ఇటీవల కాలంలో బాగా పెరిగిపోతున్నట్టు వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**వీటితో జాగ్రత్త**

ఇటీవల పెళ్లి బరాత్, దావత్ ఏదైనా డీజే సౌండ్స్ హోరెత్తుతున్నాయి. అంతేకాకుండా క్లబ్, పబ్బులలో, క్రీడా ప్రాంగణాలలో ఏర్పాటు చేస్తున్న భారీ లౌడ్ స్పీకర్ల ద్వారా శబ్ధ హోరు తీవ్రత చెవిలోపల భాగాలను పాడు చేస్తున్నాయి. ప్రధాన రహదారుల్లోని వాహనాల వద్ద 85 డెసిబెల్స్‌ను మించి ధ్వనులు ఉంటాయి. వీటిని 2 గంటల పాటు వింటే చాలు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇయర్ ఫోన్స్‌లలో పెద్ద సౌండ్‌తో సంగీతం వినడం ద్వారా 88 డెసిబుల్స్ శబ్ధం చెవిలో ప్రవేశిస్తుంది. ఇలా ఏకధాటిగా 4 గంటలు వింటే వినికిడి లోపాలు ఖాయం అంటున్నారు వైద్యులు. హెవీ మోటార్లు, బుల్డోజర్లు 90 డెసిబుల్స్ శబ్దం వెలువరిస్తాయి. వీటిని 2 గంటల పాటు వింటే వినికిడిపై ప్రభావం పడుతుందంటున్నారు వైద్యులు. 120 డెసిబుల్స్ శబ్ధం విన్న కొద్ది క్షణాలలో చెవుల్లో నొప్పితో పాటు వినికిడి శక్తి కోల్పోయే ప్రమాదం ఉంటుంది. 120 డెసిబుల్స్‌కు మించిన స్థాయి శబ్దం వింటే వినికిడి లోపం వస్తుంది.



**ఇయర్‌ఫోన్‌తో సమస్యలు**



చెవి ఓ సున్నితమైన భాగం. అలాంటి సున్నితమైన చెవిలో ఇయర్‌ఫోన్స్‌ను ఎక్కువగా వాడుతూ సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. ఇయర్‌ఫోన్స్‌తో ఎంత హాయిగా, సౌలభ్యంగా ఉంటుందో అవి ఎక్కువగా ఉపయోగిస్తే అంతే ఇబ్బందులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇయర్‌ఫోన్‌ల ఎక్కువగా ఉపయోగించే వారిలో సాధారణ వ్యక్తులతో పోలిస్తే వినికిడి లోపం వచ్చే అవకాశం అనేక రేట్లు ఎక్కువగా ఉంటుంది. ఇయర్ ఫోన్‌లను పెట్టుకోవడం వల్ల బయటి భాగం కొన్నిసార్లు ఇన్ఫెక్షన్లకు దారితీస్తాయి. ఎక్కువ సమయం పాటలు వినడం, ప్రతీరోజూ అదేపనిగా ఇయర్‌ఫోన్లను ఉపయోగిస్తే చికాకు కలిగించే నొప్పి వస్తుంది. నేరుగా ధ్వని చెవిలోకి చేరడంతో క్రమంగా నొప్పిగా అనిపించడం, తల, మెడ నొప్పులతో పాట ుతల తిప్పడం వంటి సమస్యలు వస్తాయి.

**పెరుగుతున్న వినికిడి సమస్య బాధితులు**



ఇటీవల పిల్లల నుంచి పెద్దల వరకు మొబైల్‌ఫోన్‌లలో ఎక్కువగా లీనమవుతున్నారు. చెవులకు ఇయర్‌ఫోన్స్ తగిలించుకుంటున్నారు. దీంతో సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. యువత అయితే మరీ ఎక్కువగా వాడుతున్నారు. ఇయర్‌ఫోన్స్ వాడకం తక్షణమే తగ్గించాలి. జాగ్రత్తలు కూడా తీసుకోవాలి లేకుంటే వినికిడి లోపం అధికమవుతుంది. ఇయర్‌ఫోన్ అధికంగా వాడితే ధ్వని కాలుష్యం నేరుగా చెవిలోకి చేరి వినికిడి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. విందు, వినోదాలలో పెద్ద శబ్దాలు ఎక్కువ వాడుతున్నారు. 120 డెసిబుల్స్‌కు మించి శబ్దం వింటే వినికిడి లోపం ఏర్పడుతుంది. కాబట్టి ఎక్కువ శబ్దాలను నిరోధించాలి. ఇదే కాకుండా గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

\- డాక్టర్ కిరణ్ రెడ్డి, ఈఎన్టీ వైద్య నిపుణులు, మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

చిన్నశంకరంపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిచాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. చిన్నశంకరంపేటలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఇన్‌పేషెంట్ వార్డు, ల్యాబ్, టీకా గది, ఔషధాలను నిలువ ఉంచే డ్రగ్ స్టోర్ విభాగాలను ఆయన పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి, వైద్య సేవలను తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకం కలిగేంచేలా, వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేయాలని సూచించారు. వైద్యం కోసం వచ్చిన రోగులను కలెక్టర్ పలకరించి, వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.


ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

## బాలింత మృతిపై మంత్రి విచారణకు ఆదేశం

- రెండు ఆస్పత్రులను తనిఖీ చేసిన వైద్య బృందం
- రికార్డులు స్వాధీనం, నోటీసులు జారీ
- వెల్‌నెస్ హాస్పిటల్‌పై చర్యలకు వైద్య శాఖ ఆదేశం

సంగారెడ్డి అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : తీవ్ర రక్తస్రావంతో సంగారెడ్డిలోని వెల్‌నెస్ ఆస్పత్రిలో చేరిన బాలింత చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిన ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందించారు. ఈ మేరకు విచారణ చేయాలని మంత్రి దామోదర్ జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో దిగ్వాల్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఎంఎల్‌హెచ్‌పీ, స్టాఫ్‌నర్సు పలువురు సిబ్బంది జహీరాబాద్‌లోని నీలం హాస్పిటల్, సంగారెడ్డిలోని వెల్‌నెస్ ఆస్పత్రులను ఆదివారం తనిఖీ చేశారు. బాలింతకు అందించిన చికిత్స వివరాలను సేకరించారు. ఇందుకు సంబంధించిన కేస్‌షీట్లను స్వాధీనం చేసుకుని ప్రాథమికంగా రెండు ఆస్పత్రులకు నోటీసులు జారీ చేశారు. ఇలా ఉండగా వెల్‌నెస్ హాస్పిటల్‌పై చర్యలకు తీసుకోవాలని పోలీసులు శాఖను కోరినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

# పసి హృదయాల సంజీవని


ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించుకున్న చిన్నారులు(ఫైల్)

సత్యసాయి చైల్డ్ కేర్ సెంటర్‌లో ఉచిత ఆపరేషన్

రెండు నెలల్లో 60కిపైగా చిన్నారులకు వైద్యం

నేటి నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభం

కొండపాక, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పసి గుండెకు చిల్లు పడిందంటే ఆ తల్లిదండ్రుల వేదన చెప్పరానిది. నిరుపేద కుటుంబంలో పుట్టిన పిల్లల పరిస్థితి చెప్పనవసరం లేదు. వైద్యం అందక గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులు ఎంతోమంది మృతి చెందుతున్నారు. దేశంలో 2.48 లక్షల మంది పిల్లలు పుట్టుకతో గుండె వ్యాధితో బాధపడుతున్న వారున్నారు. ఇందులో అరవై వేల మందికి ఆపరేషన్లు అవసరం. దేశంలో కేవలం పదివేల మందికి సర్జరీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులను అధిగమించడం కోసం సత్యసాయి సేవా సంస్థలు చైల్డ్ కేర్ సెంటర్‌లను ప్రారంభించింది. మారుమూల ప్రాంతమైన సిద్దిపేట జిల్లాలోని కొండపాక ఆనంద నిలయం శివారులో సత్యసాయి సంజీవని చైల్డ్ ఫర్ హార్ట్ కేర్ అండ్ రీసెర్చ్ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. ఈ ఆసుపత్రిలో నవంబరు చివరి మాసంలో చిన్నారులకు గుండె ఆపరేషన్లను ప్రారంభించారు. రెండు నెలల్లోనే 60కిపైగా చిన్నారులకు ఉచిత ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారు. ఆపరేషన్లు చేసుకున్న పిల్లలు, వారి తల్లిదండ్రుల ఆనందం చెప్పరానిది. ఈ ఆస్పత్రిలో 45 రోజుల పసికందు మొదలు 12 సంవత్సరాల వయసు ఉన్న వారికి సైతం ఆపరేషన్లు జరిగాయి.

**ఎక్కడి చిన్నారులైన నమోదు చేసుకోవచ్చు**

సత్యసాయి సంజీవని ఆసుపత్రిలో చిన్నపిల్లల గుండె ఆపరేషన్లు పూర్తిగా ఉచితంగా నిర్వహించనున్నారు. ఆపరేషన్‌తో పాటు మందులు వసతి కూడా కల్పిస్తారు. నమోదు ప్రక్రియ కాగానే మెగా ఆపరేషన్లను నిర్వహించనున్నారు. అనుభవజ్ఞులైన వైద్యులతో ఈ ఆపరేషన్లు నిర్వహించి ఎంతోమంది చిన్నారులకు భవిష్యత్‌ను కల్పిస్తున్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉంటున్న ఎక్కడి వారైనా సరే పుట్టుకతో వచ్చిన గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నారు. సోమవారం నుంచి చిన్నారుల పేరు నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.



**పిల్లలకు ముందుగానే స్క్రీనింగ్**

చిన్నపిల్లలకు ముందస్తుగా పరీక్షలు చేసి వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తారు. సత్యసాయి సంజీవని ఆసుపత్రి ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో చిన్నపిల్లలకు హెచ్‌డీ స్కెత్ ద్వారా స్క్రీనింగ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఇలాంటి స్క్రీనింగ్ చేసి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారికి ఉచితంగా ఆపరేషన్ చేయనున్నారు.

**నేటి నుంచి నమోదు చేసుకోండి**

సత్య సాయి సంజీవని ఆసుపత్రిలో పిల్లలకు ఉచిత ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం. ఎవరైతే తమ పిల్లలు గుండె వ్యాధితో బాధపడుతున్న వారుంటే రాష్ట్రంలో ఎక్కడి వారైనా సరే సోమవారం నుంచి తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ఉచిత ఆపరేషన్‌లతోపాటు ఉచితంగా మందులు వసతి అన్ని కల్పిస్తున్నాం. తెలిసిన వారు ఇతరులకు సమాచారం ఇచ్చి సహాయం చేసిన వారు కావాలి. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని చిన్నారులకు ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను కల్పించాలి.

\- జగన్నాథ శర్మ, ఆసుపత్రి ప్రతినిధి





కొండపాకలోని సత్యసాయి సంజీవని ఆసుపత్రి

ఉప రాష్ట్రపతి పర్యటన..

# ఐఐటీహెచ్‌లో సందడి

పరిశోధనలపై ఆరా.. విద్యావిధానం, అభివృద్ధిపై వాకబు

విద్యార్థులకు సలహాలు, సూచనలు

హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

ఉపరాష్ట్రపతి రాకతో భద్రతావలయంలో ప్రాంగణం


ఉపరాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్‌క్రాంతి

కంది, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌ను ఆదివారం ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఆయన సతీమణి సుదేశ్ ధన్‌కర్‌తో కలిసి సందర్శించారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఐఐటీహెచ్ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపెష్ ఉపరాష్ట్రపతికి జగదీప్ ధన్‌కర్‌కు స్వాగతం పలికారు. ఒకేసారి రెండు హెలికాప్టర్లలో ఉపరాష్ట్రపతి దంపతులు, ఇతర అధికారులు, రక్షణ శాఖ అధికారులు వచ్చారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ ప్రాంగణంలో 'ఏక్ పెడ్ మా కే నామ్' అనే కార్యక్రమంలో భాగంగా ఒక మొక్కను నాటారు. ఐఐటీహెచ్‌లో జరుగుతున్న పరిశోధనలు, విద్యావిధానం, అభివృద్ధిని గురించి ఆయన స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం ఆడిటోరియంలో అధ్యాపకులు, విద్యార్థులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. చదువు మాత్రమే ప్రతీ ఒక్కరి జీవితాన్ని మారుస్తుందని హితవు పలికారు. అత్యాధునిక పరిశోధనలతో ప్రపంచస్థాయిలో ఐఐటీహెచ్‌కు గుర్తింపు పొందిందన్నారు. ఆరోగ్య సంరక్షణలకు ఉపయోగపడే సాంకేతిక పరిశోధనలు చేయాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులకు పేరు తెచ్చేలా ప్రతీ ఒక్కరు చదువులో రాణించాలని సూచించారు. పరిశోధనలు ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.



మొక్కను నాటుతున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, ఆయన సతీమణి సుదేశ్ ధన్‌కర్, పక్కన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఎంపీ రఘునందన్‌రావు తదితరులు

**ఐఐటీహెచ్ చుట్టూ మూడంచెల భద్రత**

ఉప రాష్ట్రపతి రాక సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంతరాలు జరగకుండా ఎస్పీ రూపేష్ మూడంచెల భద్రతను చేపట్టారు. వీఐపీ పార్కింగ్, ఎమర్జెన్సీ ఎగ్జిట్, హెలిపాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లు, ఐడీ కార్డుల పంపిణీ తదితర అంశాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. పాస్‌లు ఉన్న వారిని మాత్రమే ఐఐటీహెచ్‌లోకి అనుమతించారు. ఉపరాష్ట్రపతి వచ్చి వెళ్లే వరకు ఐఐటీ ప్రాంగణంలో డ్రోన్ కెమెరాలు ఇతర ఫ్లయింగ్ పరికరాల వాడకంపై నిషేధం విధించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీ సంజీవ్ రావు, డీఎస్పీ సత్తయ్యగౌడ్, ఆర్డీవో రవీంధర్‌రెడ్డి, డీఏవో సాయిబాబా, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్ ఉన్నారు.

## ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా..?



సిర్గాపూర్ మండలం సుల్తానాబాద్ శివారు అటవీప్రాంతం పక్కనే ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలు

కల్హేర్ మండలం సుల్తానాబాద్, సిర్గాపూర్ గ్రామాల సమీపంలో అటవీ ప్రాంతం పక్కనే అక్రమంగా ఇటుక బట్టీలు ఏర్పాటు చేశారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బట్టీల ఏర్పాటు మూలంగా వరి పొట్టు, కట్టెలు, నల్ల బొగ్గుతో దుష్పలితాలు కలుగనున్నాయని, అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

- కల్హేర్, (ఆంధ్రజ్యోతి)

## సూచికబోర్డు ఇలా.. దారి తెలిసేదెలా..!




వెల్దుర్తి మండలం కుకునూర్ వెళ్లే దారిలో రోడ్డు పక్కన పడ్డ సూచిక బోర్డు

వెల్దుర్తి మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు కిందపడిపోయాయి. దీంతో గ్రామాలకు వెళ్లే కొత్తవారికి దారి తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

- వెల్దుర్తి, (ఆంధ్రజ్యోతి)

## తస్మాత్.. జాగ్రత్త



బీదర్ చౌరస్తా వద్ద వైర్లు తేలి దిమ్మెపై వంగిన ట్రాన్స్‌ఫార్మర్

జహీరాబాద్ ప్రాంతంలోని బీదర్ చౌరస్తా, రంజోల్ తదితర ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు శిథిలావస్థకు చేరి, వైర్లు తేలి ప్రమాదకరంగా మారాయి. చుట్టూ ఫెన్సింగ్ కూడా లేకపోవడంతో ప్రజలు, మూగజీవాలు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితి ఏర్పడుతోంది. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- జహీరాబాద్, (ఆంధ్రజ్యోతి)

### న్యూస్ బాక్స్

#### నేటి నుంచి గంగమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠాపన

టేక్మాల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాద్లూర్‌లో గంగమ్మదేవి ఆలయ నిర్మాణ పనులు పూర్తికావడంతో విగ్రహ ప్రతిష్ఠాపనకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో గంగమ్మదేవి, కుర్మా, ముసలి, బలిపీటం, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించేందుకు రామగుండం నుంచి తీసుకొచ్చారు. 3 నుంచి 8 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు రాజేందర్ తెలిపారు.

#### ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా మహేష్‌రెడ్డి

టేక్మాల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా మహేష్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు యడవల్లి వెంకటస్వామి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా మహేష్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని అప్పజెప్పినందుకు రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామికి, జాతీయ అధ్యక్షుడు వరుణ్‌చౌదరికి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు.

#### సెల్‌టవర్ ఏర్పాటుతో ప్రమాదం

జహీరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ల మధ్యలో సెల్‌టవర్ ఏర్పాటు చేయడంతో మున్ముందు ప్రమాదం పొంచి ఉన్నదని, సెల్‌టవర్ ఏర్పాటును రద్దు చేయాలని సాయినగర్‌కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు విన్నవించామని కాలనీవాసులు గౌతంరెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, వర్ధన్‌గౌడ్ తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి సెల్‌టవర్ ఏర్పాటు పనులను రద్దు చేయించాలని కోరారు.

#### ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

చేగుంట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో రేపు 2023 - 2024 సంవత్సరానికి సంబంధించిన ఉపాధిహామీ పథకంపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఏపీవో శ్వేత ఓ ప్రకటనలో తెలిపారు. ఈ తనిఖీకి రైతులు, ఉపాధిహామీ సంబంధించిన నిర్వాహకులు హాజరుకావాలని ఆమె తెలిపారు.

#### కుక్కల దాడిలో ఆరుగురికి గాయాలు

మెదక్ కల్చరల్, మార్చి 2: మెదక్ మండల మక్తభూపతిపూర్ గ్రామంలో కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. ఆదివారం ఉదయం ఇంటి ఆవరణలో పనిచేస్తున్న ఆరుగురిపై దాడిచేశాయి. గాయపడ్డవారిని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

#### 6న నీలగిరి చెట్ల వేలం

నర్సాపూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం నత్నయపల్లి సమీపంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఉన్న నీలగిరి చెట్లను ఈ నెల 6న వేలంపాట ద్వారా విక్రయించనున్నట్లు కేంద్రం ఇన్‌చార్జి సైంటిస్టు శోభ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పరిశోధన కేంద్రంలో 360 నీలగిరి చెట్లను వేలం వేయనున్నామని, పాల్గొనేవారు రూ.1000 డిపాజిట్ చేయాలన్నారు. ఉదయం 10.30 వరకు వేలం వద్దకు చేరుకోవాలన్నారు.

#### సగర సంఘం అధ్యక్షుడిగా సాయిలు

రేగోడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : సగర సంఘం(ఉప్పర) రేగోడు మండల అధ్యక్షుడిగా ఉప్పరి సాయిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఉప్పరి శివకుమార్, ప్రధాన కార్యదర్శి ఉప్పరి రాజు, కోశాధికారిగా ఉప్పరి ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా ఉప్పరి సాయిలు, ప్రచార కార్యదర్శిగా ఉప్పరి మోహన్, కార్యవర్గ సభ్యులుగా ఉప్పరి శివరాజ్, ఉప్పరి రాజు, ముఖ్య సహాయకుడిగా ఉప్పరి రాజులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

#### ముగిసిన గంధాల ఉత్సవాలు

నారాయణఖేడ్, మార్చి 2: ఖేడ్ మండలం జూజాల్‌పూర్ శివారులోని సయ్యద్‌గుట్టు మౌలాలి దర్గా వద్ద రెండురోజులుగా నిర్వహించిన సయ్యద్ గుట్టు మౌలాలి గంధాల ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజు జల్సా, అలయ్, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక భావనతో మానసిక ప్రశాంతత



ఉమామహేశ్వర కల్యాణంలో ఎంపీ సురేష్‌షెట్కార్

జహీరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావన ఉన్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్‌షెట్కార్, మాజీమంత్రి డా.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని పాండురంగ మందిరంలో ఆర్య వైశ్యసమాజ్ ఆధ్వర్యంలో ఉమామహేశ్వర కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైనందిన జీవితంలో కొంత సమయాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటాయించాలని ఎంపీ సూచించారు. ముందుగా ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఎంపీకి, మాజీ మంత్రికి ఘన స్వాగతం పలికి, పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఇదిలా ఉండగా స్వామివారి కల్యాణంలో మాజీ ఎంపీ బీబీపాటీను కూడా ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు.

## వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం

● హాజరైన ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పెద్ద శంకరంపేట పట్టణ శివారులోని కట్ట మైసమ్మ గురుపాదు గుట్ట శివాలయంలో ఆదివారం భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ మహోత్సవానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ మండపాన్ని వివిధరకాల పూలతో, అరటి మెట్టెలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అలాగే గురుపాదగుట్ట శివాలయం జాతరలో భాగంగా ఆదివారం సాయంత్రం ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించారు.

**శ్రీపాదరావుకు ఎమ్మెల్యే నివాళి**

నారాయణఖేడ్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తండ్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఈ శాసన సభాపతి దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని ఆదివారం హైదరాబాద్‌లోని శాసన సభలాంజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులతో కలిసి ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**విఠలేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే**

నాగల్‌గిద్ద, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఏనక్‌పల్లి గ్రామంలో ఆదివారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి విఠలేశ్వరుడి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సప్ప, నాయకులు పాల్గొన్నారు.

## నత్తనడకన రోడ్డు పనులు

● రోడ్డును తవ్వి వదిలేయడంతో ప్రయాణికుల ఇబ్బందులు

● మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు



కొత్తూర్(బీ) వద్ద రోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యం

జహీరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ మండలంలోని బీదర్-జహీరాబాద్ మధ్యలో మరమ్మతుల పేరిట కొత్తూర్(బీ) తదితర ప్రాంతాల్లో రోడ్డును తవ్వి వదిలేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. జహీరాబాద్ మొదలుకుని కర్ణాటక బార్డర్ వరకు సుమారు 8 కిలోమీటర్ల రోడ్డుపై గుంతలు పడ్డాయి. రోడ్డు మరమ్మతులకుగాను రూ.5.60 కోట్లు మంజూరైనా పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం చేయడంలో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. 20 రోజుల క్రితం కొత్తూర్(బీ), గుంగ్వార్ తదితర ప్రాంతాల్లో రోడ్డును తవ్వి పనులు చేపట్టడంలో జాప్యం చేయడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జహీరాబాద్ పట్టణానికి బీదర్ సుమారు 40 కిలో మీటర్లు ఉండడంతో స్థానికులు వివిధ అవసరాల నిమిత్తం నిత్యం బీదర్ పట్టణానికి వెళ్తుంటారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

## ప్రజాభిమానాన్ని పొందిన నేత శ్రీపాదరావు

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలవేసి పుష్పాంజలి సమర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : రాజకీయాల్లో ప్రజాభిమానాన్ని చూరగొని ఎంతోమంది ప్రముఖులు, రాజకీయ విశ్లేషకులతో ప్రశంసలు అందుకున్న గొప్ప వ్యక్తి శ్రీపాదరావు అని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం కలెక్టరేట్‌లో స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శ్రీపాదరావు స్పీకర్‌గా ఉన్న సమయంలో నిజాయితీ, నిరాడంబరత ప్రజలు హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతుందన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని జిల్లా అభివృద్ధికి అధికారులందరూ పునరంకితులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా కుస్తీ పోటీలు



కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

నారాయణఖేడ్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మాద్వార్‌లో దుర్గాభవానీమాత జాతరలో భాగంగా ఆదివారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించిన పోటీలు ఆసక్తికరంగా జరిగాయి. వివిధ విభాగాల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేయగా.. చివరి పోటీ విజేతకు గ్రామ పెద్దలు రామచేందర్‌రావు, మారుతి, రామాగౌడ్, శివరాజ్, ఈశ్వర్‌గౌడ్, భూమయ్య, తదితరులు వెండి కడియాన్ని బహూకరించారు.

## ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

రాయికోడ్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆలయ అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల కేంద్రంలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి అన్నారు. ఆదివారం ఆలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వేసవికాలం ప్రారంభం దృష్ట్యా నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈనెల 10న ఆలయంలో గల కొబ్బరికాయల, టీ స్టాల్ కోసం టెండర్లు నిర్వహిస్తున్నామని, ఆసక్తి గలవారు ముందుగా కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఏప్రిల్ 17 నిర్వహించే జాతర ఏర్పాట్లపై కూడా చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో స్వరూద్రప్ప, మాజీ సర్పంచ్ కేదార్‌నాథ్‌పాటిల్, ధర్మకర్త దత్తురెడ్డి, ధర్మకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 'గీతా'లో ఫేర్‌వెల్ డే



సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థులు

మనోహరాబాద్ ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని గీతా స్కూల్‌లో ఫేర్‌వేల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయులు మాట్లాడుతూ పదో తరగతి ప్రతీ విద్యార్థికి కీలక దశ అని, బాల్య స్మృతులు ఇక్కడే పురుడుపోసుకుంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్‌పర్సన్ ఉష, డైరెక్టర్లు రాఘవేందర్‌గౌడ్, నారాయణగుప్తా, ప్రిన్సిపాల్ సీహెచ్.వెంకట కృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు.

## విఠలా రుక్మిణీ ఆలయంలో పూజలు

నాగల్‌గిద్ద, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఏనక్‌పల్లి గ్రామంలో ఆదివారం స్థానిక విఠలా రుక్మిణీ ఆలయంలో ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మాజీ ప్రణాళిక మండలి సంఘం సభ్యులు నగేష్‌షెట్కార్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సుధాకర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు కె.శ్రీనివాస్ హాజరై ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు వారిని శాలువాతో సన్మానించారు.

## 4న చాప్టా.కెలో అష్టావధానం

నారాయణఖేడ్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చాప్టా.కె జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 4న అష్టావధానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహితీ కళా ప్రవీణ స్వర్ణకంకణ సత్కార గ్రహీత పద్యశిల్పి యువ అవధానిచే అష్టావధానం, పద్య కవి సీహెచ్.భూమయ్య రచించిన శ్రీరామ శతకం పుస్తకావిష్కరణ సైతం నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్ఎం నర్సింలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అష్టావధానులు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, కంది శంకరయ్య, చక్రవర్తి పాల్గొంటారని, తెలుగు భాషాభిమానులు, కవులు, సాహితీ ప్రియులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## అక్రమ బ్లాస్టింగ్‌లు నిలిపేయాలి



మల్లుపల్లిలో ఆందోళన చేస్తున్న రైతులు, ప్రజలు

శివ్వంపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : అక్రమ పట్టా చూపిస్తూ నిషేధిత పదార్థాలతో అక్రమ బ్లాస్టింగ్‌లకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని దొంతి గ్రామ ప్రజలు, రైతులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. శివ్వంపేట మండలం దొంతి రెవెన్యూ గ్రామ పరిధిలోని మల్లుపల్లి గ్రామంలో సర్వే నంబరు 526/1/1/1లో గోనెగారి శ్రవణ్‌కుమార్ పేరిట ఉన్న భూమిలో సుమారు 100 ఏళ్లుగా పెద్దపెద్ద బండరాళ్ల గుట్టలు ఉన్నాయి. మల్లుపల్లి గ్రామానికి చెందిన గ్యాదరి శ్రీనివాస్ అక్రమ పట్టా చూపిస్తూ నెలరోజులుగా నిషేధిత పేలుడు పదార్థాలతో అక్రమ బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అక్రమ బ్లాస్టింగ్ నిలిపివేయాలని మాజీ సర్పంచ్ శశాంక్‌శర్మ, కాంగ్రెస్ నాయకులు భవనగారి శ్రీనివాస్, రామచందర్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సంబంధిత వ్యక్తి శ్రీనివాస్‌ను సంప్రదించగా 526 సర్వే నంబరు భూమి తాను కొనుగోలు చేశానని, ఆ భూమికి సంబంధించి హైకోర్టులో స్టే ఆర్డర్ ఉన్నదని, కొందరు కావాలని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపాడు. స్థానిక తహసీల్దార్ కమలాద్రిని ఫోన్‌లో సంప్రదించగా ఆ భూమి పట్టా భూమి అని, సరిహద్దు సమస్యను సర్వే చేయించి సమస్య పరిష్కరిస్తారని తెలిపారు.

## 'గ్రామీణ బ్యాంకులో ఓటీఎస్ అవకాశం పెంచాలి'

రేగోడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో మొండి బకాయిలను వసూలు చేసేదుకు వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) అవకాశం 15 రోజులు గడువు పొడిగించాలని కొత్వాల్‌పల్లి మాజీ ఎంపీటీసీ నర్సింలు, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు గున్న సంగమేశ్వర్, కొండాపూర్ మాజీ సర్పంచ్ పండరి ఆదివారం తెలిపారు. రేగోడు గ్రామీణ బ్యాంకులో రైతుల మొండి బకాయిలకు వన్ టైం సెటిల్‌మెంట్ ద్వారా 25శాతం రుణం చెల్లిస్తే పూర్తిస్థాయి మాఫీ కల్పించారు. ఈ అవకాశం ఫిబ్రవరి 28 వరకే ఉండడంతో రైతులు కట్టలేక పోయారని, మార్చి 15 వరకు పెంచాలని కోరారు.

## రాచన్నస్వామి సన్నిధి.. వరాల పెన్నిధి

● 4 నుంచి జాతర, 6న స్వామివారి కల్యాణం



కోహీర్ మండలం బడంపేటలోని రాచన్నస్వామి ఆలయం

కోహీర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలంలోని బడంపేటలో వెలసిన రాచన్నస్వామి జాతర మహోత్సవాలు ఈ నెల 4 నుంచి 6వ తేదీవరకు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. శివరాత్రి పర్వదినం వారంరోజుల తరువాత ఈ ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుపుతారు. జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని నిర్వాహకులు తెలిపారు. జాతరకు జహీరాబాద్-మనియార్‌పల్లి మధ్య దేవస్థానం వరకు ఆర్టీసీ బస్సులు నడుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

## కిష్టయ్యపల్లిలో ఘనంగా గాలిపోచమ్మ జాతర



పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జిన్నారం, మార్చి, 2 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం కిష్టయ్యపల్లిలో గాలిపోచమ్మ జారత ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా రెండురోజులుగా బోనాల ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా జిన్నారంలో నిర్మించిన పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ ప్రకాశంచారి, మాజీ ఎంపీటీసీలు లావణ్య, బాసెట్టిగారి రాజు, భార్గవ్, నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## నస్కల్ రోడ్డు పనులు ప్రారంభం




కొనసాగుతున్న నిజాంపేట-నస్కల్ రోడ్డు పనులు

నిజాంపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : 'కంకర వేశారు.. తారు మరిచారు..!' అని ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్అండ్‌బీ అధికారులు ఆదేశానుసారం సదరు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ఎక్స్‌కవేటర్లతో కంకరను తొలగింపు పనులు చేపట్టారు. నెలరోజుల్లో ఈ రోడ్డు బీటీ రోడ్డుగా మారి ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

## నర్సాపూర్‌లో కొనసాగుతున్న దీక్ష



నర్సాపూర్‌లో దీక్షలో మొబైల్ అసోసియేషన్ ప్రతినిధులు

నర్సాపూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నల్లవల్లి ప్రాంతంలో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేస్తున్న డంపింగయార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం కూడా నిర్వహించారు. ఆదివారం నర్సాపూర్ మొబైల్ అసోసియేషన్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో ప్రతినిధులు దీక్షలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోడరాజేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## రోడ్డుపై గుంతలు పూడ్చివేత

రామచంద్రాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో దశాబ్దకాలంగా కొనసాగుతున్న రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్ పనులు త్వరగా పూర్తిచేయాలని స్థానికులు అనేక వినతిపత్రాలను అధికారులకు అందించారు. రాష్ట్ర మంత్రులకు విజ్ఞప్తులు చేశారు. ఎంతకీ ఫలితం దక్కలేదు. ఆదివారం తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ (తెనా) పెద్దపెద్ద గుంతలు ఉన్నచోట మట్టి వేసి పూడ్చారు. ఈ సందర్భంగా తెనా అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ దశాబ్దకాలం పూర్తవుతున్నా రేడియల్ రోడ్డు పనులు పూర్తి కావడం లేదన్నారు. రోడ్డు పనులు సకాలంలో పూర్తిచేయకపోతే గేటెడ్ కమ్యూనిటీలు, స్థానికులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని రమణ హెచ్చరించారు.

## రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

మాసాయిపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకిని ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి చౌరస్తా వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. మాసాయిపేటకు చెందిన గొల్ల శివకుమార్ బైక్‌పై తూప్రాన్ నుంచి మాసాయిపేటకు వస్తున్నాడు. అచ్చంపేటకు చెందిన మరో వ్యక్తి తూప్రాన్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చెట్ల తిమ్మాయిపల్లి చౌరస్తా వద్దకు రాగానే రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఇందులో శివకుమార్‌ను కొంపెల్లిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.